క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పల్లిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, స్థానికులు

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలను ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నందున అపారిశుధ్య వాతావరణం తలెత్తితే అంటువ్యాధులు వ్యాపించేందుకు అవకాశం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా చివరి వారంలో సోమవారం నుంచి శనివారం వరకూ స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక అధికారులు, సిబ్బంది పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తారన్నారు. కార్యక్రమాల్లో ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీఓ నాగేశ్వరశర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీవీ కళ్యాణి, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గనిరాజు



ఉండ్రు గనిరాజు

రామచంద్రపురం: అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉండ్రు గనిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.భీమరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో గనిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. గనిరాజు పీడీఎస్‌యూ ఏరియా కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడిగా, కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షులుగా విద్యార్థి ఉద్యమాల్లో పని చేశారని తెలిపారు. తదనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావటంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మగ్దలేన మరియమ్మ వేడుకలు



క్రీస్తును ఉద్దేశించి ప్రసంగిస్తున్న బిషప్ డాక్టర్ జయరావు

మండపేట: పునీత మగ్దలేన మరియ మహోత్సవాలను స్థానిక మెయిన్ రోడ్డులోని రోమన్ కేథలిక్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. మరియమ్మ పండుగను పురస్కరించుకుని కేథలిక్ చర్చి ఫాదర్ రత్నాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయురారోగ్యాలతో సకల జనులు వర్ధిల్లాలని ప్రార్థిస్తూ పెద్దకాలువ వంతెన నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ఈ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఏలూరుకు చెందిన బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో మరియమ్మ గొప్పతనాన్ని వివరించారు. పునీత మగ్దలేన మరియ దేవమాత అని కొనియాడారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ స్కూల్ సిస్టర్స్, ఆయా చర్చ్ ఫాదర్లు, సిస్టర్స్, పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

బకాయిదారులపై చట్ట ప్రకారం చర్యలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పంచాయతీకి బకాయి పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమించినట్లు ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్రాక్షారామ గ్రామ పంచాయతీకి 2021–22 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌లో రోజువారి, వారపు సంతల్లో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి పాటలను వెలంపాలెం గ్రామానికి చెందిన శిరిగినీడి సత్తిబాబు అనే వ్యక్తి రూ.10,26,000లకు పాడుకొన్నారన్నారు. అయితే నిర్ణీత కాలవ్యవధిలో రూ.2,80,000 మాత్రమే పంచాయతీకి చెల్లించి మిగిలిన సొమ్ము రూ.7,46,000లు వడ్డీతో సహా చెల్లించాల్సిందిగా కోరుతూ కోర్టు ద్వారా కోరినట్లు తెలిపారు. అదే విధంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో అవే రోజువారీ, వారపు సంతల పాటలను ద్రాక్షారామ గాంధీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీనివాసరావు రూ.14,69,500లకు పాడుకొని రూ.6,94,626లు పంచాయతీకి బకాయి పడిన కారణంగా అతనిపైనా కోర్టు ద్వారా ప్రొసీడ్ కావడం జరిగిందని తెలిపారు.



సుందరపల్లి వద్ద ఇసుక బస్తాలు వేసి గట్టును పటిష్టం చేస్తున్న కూలీలు



సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న గట్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు తదితరులు



కపిలేశ్వరపురం మండలం కేదారిలంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

గోదావరి ఉగ్రరూపం

- గంటగంటకూ పెరుగుతున్న గోదావరి
- ఆందోళనలో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు



కేదారిలంక సూర్యగుండాలరేవులో వరద నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కొండలరావు



కపిలేశ్వరపురం మండలం, నారాయణలంక గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుధాసాగర్

కె.గంగవరం: ఏటా వర్షాకాలం వచ్చిందంటే గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు వరదల కారణంగా ఆందోళనతో కంటి మీద కునుకు లేకుండా పోతుంది. తాజాగా ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకు భారీగా వరదనీరు చేరుతుంది. వరదనీటిని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వదలడం వల్ల కోటిపల్లిలో వరద పెరుగుతుంది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోకి వరద నీరు కలిసేందుకు ఉరకలు వేస్తూ పరవళ్లు తొక్కుతుంది. సోమవారం ఉదయం నుంచి గంట గంటకూ గోదావరి పెరుగుతూనే ఉందని స్థానికులు అంటున్నారు. రాత్రికి మరింత పెరిగితే కోటిపల్లిలో మత్స్యకార కాలనీ మొత్తం నీట మునుగుతుందని స్థానికులు వాపోతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుందని గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈఈ సుబ్బారావు, రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ అన్నారు. మండలంలోని సుందరపల్లి, కూళ్ల గ్రామాలతో పాటు గోదావరి కోతకు గురవుతున్న ప్రాంతాల్లో సోమవారం వారు పర్యటించారు. మరో రెండు మూడు రోజుల్లో గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉందని గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరిలో అనుమతి లేకుండా ఏ బోటు, నాటు పడవ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులను కూడా అప్రమత్తంగా చేశామని గట్టు బలహీనంగా ఉన్న చోట్ల తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పుష్కర్ ఘాట్‌ల మెట్లను తాకుతూ..

కపిలేశ్వరపురం: గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద కపిలేశ్వరపురం, తాతపూడి, వాకతిప్ప గ్రామాల పుష్కర ఘాట్‌ల మెట్లను తాకింది. కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల శివారు ప్రాంతాన్ని ముంచెత్తింది. నీటిమట్టం మరింతగా పెరిగితే వ్యవసాయ క్షేత్రాలు ముంపు బారినపడే ప్రమాదం పొంచి ఉంది. ధవళేశ్వరంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే పరిస్థితులు ఎదురైతే కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాలు సైతం ముంపు బారినపడతాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై నారాయలంకలోని వరద పరిస్థితులను రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ పరిశీలించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీడీఓ కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సీడీపీఓ గజలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు స్థానిక పరిస్థితులను వివరించారు. వరద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులనుఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. కేదారిలంక, అద్దంకివారిలంక, పల్లపులంకలలో తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీఓ కొండలరావు పర్యటించారు. సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఇతర ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ప్రజాప్రతినిధులు సందర్శించి పలు సూచనలు చేశారు.

ముంపునీరు తొలగింపునకు చర్యలు తీసుకోవాలి



ఆర్యావటంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్ తదితరులు

కాజులూరు: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నారుమడులు, వెదజల్లిన పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా రైతులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాకినాడ జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, కోలంక, నామవానిపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి నీటమునిగిన నారుమడుల సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కోలంకలో ఏడీఏ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష హెక్టార్లలో రైతులు వరి సాగు చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకూ 25 వేల హెక్టార్లలో రైతులు నాట్లు వేయడం జరిగిందన్నారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 2700 హెక్టార్లలో పంట నీటమునిగిపోయిందన్నారు. పొలాల్లోని వర్షపునీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లకపోతే మొలకెత్తిన నారు దెబ్బతింటుందని, నారుమడి సక్రమంగా మొలవకపోతే వరినారు కొరత ఏర్పడుతుందన్నారు. మండలంలోని పలు చోట్ల డ్రెయిన్లలో పూడికలు అడ్డుపడటం వలన ముంపునీరు పొలాల్లో నిలిచిపోతుందని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన జేసీబీలతో పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కరప ఏడీఏ కె.బాబురావు, ఏవో వి.అశోక్, వ్యవసాయ సహాయకులు అనివిశ్మ ప్రకాశ్, కె.సురేష్, కె.శివప్రసాద్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వరదలతో పోలీసుల అలర్ట్

- సిబ్బందిని అప్రమత్తం చేశాం
- కాజ్‌వేల వద్ద బందోబస్తు ఏర్పాటు
- మీడియాతో ఎస్పీ బి. కృష్ణారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

మండపేట: గోదావరికి వరద వచ్చినందున ముంపు ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు తెలిపారు. మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. గోదావరికి ధవళేశ్వరం వద్ద నీటి మట్టం పెరుగుతోందని, రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందన్నారు. ముందుగానే వరద ప్రభావిత గ్రామాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ అధికారులకు తగిన సూచనలు ఇస్తున్నామన్నారు. కాజ్‌వేలు, ఇతర ముంపు ప్రాంతాల వద్ద రాత్రి వేళల్లో కూడా బందోబస్తు ఏర్పాటు చేసి ఎవరూ అటుగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ, ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ప్రాణనష్టం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

నూతన భవన నిర్మాణానికి చర్యలు

మండపేట పోలీస్‌స్టేషన్ భవనం పాతది కావడంతో శిథిల స్థితికి చేరుకుందని ఎస్పీ బి. కృష్ణారావు చెప్పారు. పునాది లేకుండా నిర్మించారని, శ్లాబ్ నుంచి వర్షపు నీరు లీకేజీ అవుతోందన్నారు. ఈ భవనం పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ బి. రామకృష్ణ, రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్, పట్టణ ఎస్ఐ హరికోటి శాస్త్రి, ఏఎస్ఐ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జెస్సీ ఎంపిక

పి.గన్నవరం: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 30వ ఇంటర్ క్లబ్ చాంపియన్‌షిప్ తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస క్లబ్ విద్యార్థిని గిడ్డి జెస్సీ లేఖన బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు.

ఆందోళనలో చిరుద్యోగులు

- డిమాండ్లపై స్పందించని కూటమి ప్రభుత్వం
- 2019కు ముందు పాలనను గుర్తు చేసుకుంటున్న వైనం
- రెండు నియోజకవర్గాల్లో విస్తృతంగా చిరుద్యోగులు



కపిలేశ్వరపురంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: వ్యవస్థకు రథ చక్రాలు చిరుద్యోగులు. జీతాలు, గుర్తింపు అంతంత మాత్రంగా పొందుతున్నప్పటికీ సమాజ ప్రగతికి తమ వంతుగా కృషి చేస్తున్న చిరుద్యోగులు ఈనెల 10న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. క్షేత్ర స్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు, కార్యకర్తలు వేధిస్తున్నారంటూ, ఐసీడీఎస్‌ను సంస్థాగతం చేయాలంటూ, వేతనాలు పెంచాలంటూ ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. సీపీఎస్ ఇస్తామని చెప్పి జీపీఎస్ అమలుకు వీలుగా జీవో విడుదల చేయడంపై ఉపాధ్యాయులు మండి పడ్డారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఇలా కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవి చూసింది. 2019కు ముందటి రోజులు వచ్చాయంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చిరుద్యోగులు, శ్రామికులు ఇలా...

క్లస్టర్ పరిధిలో మండలాలవారీగా రామచంద్రపురంలో 105, కె.గంగవరంలో 78, కాజులూరు 80, కపిలేశ్వరపురంలో 78, రాయవరంలో 70, మండపేటలో 94 రెండు నియోజకవర్గాల్లో 505 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సేవలందిస్తున్నారు. అలాగే మండలాల వారీగా రాయవరంలో 80, మండపేటలో 74, కపిలేశ్వరపురంలో 90 మొత్తం 244 మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో 23 పీహెచ్‌సీలు, పలు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల పరిధిలో వందల మంది వైద్యసేవలందిస్తున్నారు. రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు 120 గ్రామాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో వందలాది మంది చిరుద్యోగులు, పారిశుధ్య కార్మికులు సేవలందిస్తున్నారు.



2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో కపిలేశ్వరపురంలో అంగన్‌వాడీల నిరసన (ఫైల్)

2019కు ముందు ఉక్కుపాదం

2019కు ముందటి టీడీపీ ప్రభుత్వంలో చిరుద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులంతా ఉద్యమాలు చేస్తూ సతమతమయ్యారు. పారిశుధ్యాన్ని ప్రైవేట్ పరం చేస్తూ అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జీఓ 279ను జారీ చేయడాన్ని నిరసిస్తూ మండపేటలో కార్మికులు భారీ ర్యాలీ చేశారు. వేతనాల పెంపు కోసం కపిలేశ్వరపురం, రాయవరంలలో పారిశుధ్య కార్మికులు పలుమార్లు ఉద్యమాలు చేసినా చంద్రబాబు సర్కారు కరుణించలేదు. ఈ ఉద్యమాల నేపథ్యంలో ఆశా వర్కర్ల వేతనాన్ని రూ. ఆరు వేలకు పెంచేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించినప్పటికీ ఆ జీతాలను పెట్టడంపై వారు పోరు సాగించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చేసినప్పటికీ చంద్రబాబు ససేమిరా అన్నారు. ఆ నాటి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిరుద్యోగులపై తీవ్రమైన ఒత్తిళ్లకు పాల్పడడానికి వ్యతిరేకంగా చిరుద్యోగులు ఉద్యమించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

మాతాశిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడం, ఇమ్యునైజేషన్ కార్యక్రమంలోనూ, ఇతర ఆరోగ్య ప్రచార కార్యక్రమాల్లో నిత్యం శ్రమించే ఆశా వర్కర్ల జీతాలను రూ.10 వేలకు పెంచిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల జీతాలు పెంచారు. పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచారు.

విస్మరిస్తే ఉద్యమిస్తాం



‘ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య అనుసంధానంగా అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు వంటి చిరుద్యోగులు విశేష సేవలందిస్తున్నారు. నిర్దిష్ట సేవలతో పాటు ప్రభుత్వ సర్వేలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వారు సేవలందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఉద్యమిస్తాం. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్న డిమాండ్‌ను పరిశీలించాలి. సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీని అమలు చేయాలి. ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీస వేతనాలను రూ.26 వేలకు పెంచాలన్న తమ డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలి.’

– కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా నాయకురాలు, మండపేట

హామీల అమల్లో కానరాని చిత్తశుద్ధి

అందరి మేలు కోరే ప్రభుత్వాన్ని నడుపుతాం అంటూ చంద్రబాబు, అందుకు నాదీ హామీ అంటూ పవన్ కల్యాణ్ 2024 ఎన్నికల ప్రచార సభల్లో హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన నెల రోజులకే హామీల అమలుపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీపీఎస్ పునరుద్ధరిస్తామన్న కూటమి ప్రభుత్వం జీపీఎస్‌కు వీలుగా జీఓ విడుదల చేసింది. ప్రజాగ్రహాన్ని చవి చూడడంతో ఉత్తర్వులను రద్దు చేసుకుంది. తల్లికి వందనం పేరుతో ఇంటిలో చదివే పిల్లలందరికీ రూ.15వేల చొప్పున సాయ మందిస్తానని ఇచ్చిన హామీ పరిస్థితీ అదే. తల్లికి రూ.15 వేలంటూ ప్రకటనలు చేసింది. తల్లుల్లో ఆగ్రహాన్ని చూసి పిల్లలందరికీ ఇస్తామని ప్రకటించాల్సిన పరిస్థితి. ఇలా నడుస్తున్న కూటమి ప్రభుత్వాన్ని చూసి చిరుద్యోగుల్లో ఆందోళన కలుగుతోంది. కేంద్రంలోని గత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలను పెంచుతామని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటి వరకూ అమలు చేయలేదు. రాష్ట్రంలో సైతం ఇచ్చిన హామీలు గాలిలో తేలియాడుతున్నాయి. ఈ నేపథ్యంలో పోరాడటమే శరణ్యమంటూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు.

ద్రాక్షారామ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలసిన ఆర్డీఓ సుధాసాగర్

రామచంద్రపురం రూరల్: జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సోమవారం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ (పీఎస్)ను సందర్శించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి సారిగా ద్రాక్షారామ స్టేషన్‌కు విచ్చేసిన ఎస్పీ రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర, కె.గంగవరం ఎస్సై జానీబాషాలతో సమీక్ష చేశారు. రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో శాంతి భద్రతలు, ఎక్కువగా నమోదవుతున్న కేసులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రామచంద్రపురం ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ ద్రాక్షారామ స్టేషన్‌కు వచ్చి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

టేకిలో ప్రత్యేక వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాకేష్ చౌదరి

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని టేకి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి పి.చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ చిట్టూరి రాకేష్ చౌదరి 223 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ వర్షా కాలంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. శిబిరంలో ఎంపీహెచ్ఈఓ పీడీ బిషప్, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సేవలు అందించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కపిలేశ్వరపురం: మంగళవారం నుంచి ఈ నెల 27 వరకూ మండలంలోని పలు గ్రామ, సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు సోమవారం తెలిపారు. రాష్ట్రంలో 49,83,561 మంది ఆధార్ బయో మెట్రిక్ నమోదు, 1,36,17,047 మంది ధ్రువపత్రాల అప్‌డేషన్ పెండింగ్‌లో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. వాటితో పాటు ఐదేళ్ల వయసు లోపు వారికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేస్తారన్నారు. 23,24లలో అద్దంకివారిలంక, వాకతిప్ప, నల్లూరు సచివాలయాల్లోనూ, 25,26లలో కేదారిలంక, మాచర, అంగర 2, 27న కోరుమిల్లి 2, కేదారిలంక, వెదురుమూడి సచివాలయాల్లోనూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర సేవలందిస్తారని ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

రాయవరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పెద్ద ఎత్తున పారిశుధ్య పనులు చేపట్టాలని భారతీయ జనతాపార్టీ నేతలు కోరారు. ఈ మేరకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకిరాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గాశ్రీనివాస్ తదితరులు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దాదాపుగా మూడు వారాలుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్టు వారు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేవైఎం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరట్ల సుబ్బారావు, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈరెళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



ఖండవిల్లి భరత్‌కుమార్

రాయవరం: భారత పార్లమెంట్ చేసిన చట్టాలపై కొందరు ఐఏఎస్ అధికారులు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ అన్నారు. రాయవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగుల రిజర్వేషన్లపై చులకనగా మాట్లాడడాన్ని భరత్‌కుమార్ ఖండించారు. దివ్యాంగులపై గౌరవం ఉంది అంటూనే వారిని అవమానించేలా మాట్లాడడంపై ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను అమలు పరచాల్సిన అధికారులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే దివ్యాంగులకు స్మిత సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల చట్టం 2016- 92 (అ) ప్రకారం ఆమెపై కేసు నమోదు చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు పిలుపునిస్తామని పేర్కొన్నారు.